సాక్షి ప్రకాశం
శుక్రవారం । 9 । జూన్ । 2023



ట్రక్ ఆటోను ఢీకొట్టిన కారు
కారు ఢీకొట్టడంతో ట్రక్ ఆటో బోల్తాపడింది. ఆటోలోని 17 మందికి స్వల్పంగా, ఐదుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి.
- 8లో..



హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన
పెద్దారవీడు మండలం రాజంపల్లి గ్రామ సమీపంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పోటీలు హోరీహోరీగా సాగాయి.
- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
41/31
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికం. వడగాడ్పులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈ-ఫైలింగ్ విధానాన్ని పాటించాలి

- కలెక్టరేట్‌లోని పలు విభాగాలను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్


ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: కలెక్టరేట్‌లోని కార్యాలయాల్లో పనులకు సంబంధించిన దస్త్రాలకు ఈ-ఫైలింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఉద్యోగులకు సూచించారు. కలెక్టరేట్‌లోని పలు విభాగాలను గురువారం ఆయన పరిశీలించారు. అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో వివిధ సెక్షన్లలో ఫైళ్ల నిర్వహణ తీరును పరిశీలించారు. ఫైళ్లు నిల్వ ఉంచుకోకుండా ఈ ఫైల్స్‌గా మార్చుకుని రికార్డు రూములో భద్రపరచాలని సూచించారు. ఫైల్స్ మిస్సయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కలెక్టరేట్ సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అద్దె భవనాల్లో ఉంటున్న శాఖలకు కలెక్టరేట్‌లోనే కార్యాలయాలను సర్దుబాటు చేయాలని సూచించారు. ప్రకాశం భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించాలని సంబంధింత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో శ్రీలత, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు ఉన్నారు.

11 మంది తహసీల్దార్ల బదిలీ


ఒంగోలు అర్బన్: జిల్లాలో సాధారణ బదిలీల్లో భాగంగా రెవెన్యూ శాఖలో 11 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వెలిగండ్ల తహసీల్దార్‌గా ఉన్న సీహెచ్ నాగార్జునరెడ్డిని పామూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. వెలిగండ్ల (ఎఫ్ఏసీ)గా కురిచేడు తహసీల్దార్ షేక్ నాగూల్ మీరాను నియమించారు. సీఎస్ పురం తహసీల్దార్‌గా ఎస్ శ్రీనివాసరావును తిరిగి ఎస్ఎన్ పాడు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టరేట్ ల్యాండ్-2 సూపరింటెండెంట్‌గా ఉన్న కేవీ ప్రసాద్‌ను తాళ్లూరు తహసీల్దార్‌గా, తాళ్లూరు తహసీల్దార్ ఎస్.రామ్మోహన్‌రావును పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. అర్ధవీడు తహసీల్దార్ కె.రవిబాబును బాపట్ల జిల్లాకు కేటాయించారు. దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్‌ను పొన్నలూరు తహసీల్దార్‌గా, పొన్నలూరు తహసీల్దార్ పి.శైలేంద్ర కుమార్‌ను కంభం తహసీల్దార్‌గా, కొరిశపాడు తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణను కలెక్టరేట్ ల్యాండ్-1 సూపరింటెండెంట్‌గా, కందుకూరు తహసీల్దార్ డి.సీతారామయ్యను ఒంగోలు ల్యాండ్ రీఫామ్స్ స్పెషల్ తహసీల్దార్‌గా, ఒంగోలు ల్యాండ్ రీఫామ్స్ స్పెషల్ తహసీల్దార్‌గా ఉన్న పి.ఉమారాణిని కేఆర్‌సీసీ స్పెషల్ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు రాక నేడు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు శుక్రవారం ఒంగోలు వస్తున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం భవనంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, నవరత్నాల అమలుపై సంబంధిత శాఖలతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్రతి గొంతూ తడిసేలా..

ఒకప్పుడు కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న జిల్లాలోని శివారు పల్లెల్లో ప్రతి గడపకూ తాగునీరందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత టీడీపీ పాలకులు ఆర్భాటపు ప్రకటనలతో కాలక్షేపం చేయడంతో గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక జలజీవన్ మిషన్‌పై దృష్టి సారించింది. స్వచ్ఛ జలాలను అందరికీ అందించాలన్న లక్ష్యంతో పనులు వేగవంతం చేసింది. నూటికి నూరు శాతం పనులు పూర్తి చేసేలా జిల్లా అధికారులు పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోగా 4,98,539 మంచినీటి కనెక్షన్లు ఇచ్చేలా పనులు వేగవంతం చేశారు.



లక్ష్యం ఇలా...	నిధులు	పనులు	కుళాయి కనెక్షన్లు :
	రూ.663 కోట్లు	2,469	4,98,539


కేవీ పాలెంలో ఓహెచ్ఎస్ఆర్

నూరు శాతం పూర్తయిన గ్రామాలు...
ఇప్పటి వరకు ఇచ్చిన మంచినీటి కనెక్షన్లలో అత్యధికంగా కనిగిరి మండలం అజీస్‌పురంలో 665 మంచినీటి కనెక్షన్లు ఏర్పాటు చేయడంతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంది. అర్ధవీడు మండలం కాకర్లలో 634 మంచినీటి కనెక్షన్లతో ద్వితీయ స్థానంలో ఉంది. 513 మంచినీటి కనెక్షన్లతో పీసీ మండలం నేరేడుపల్లి గ్రామం మూడో స్థానంలో నిలిచింది.

టీడీపీ ఐదేళ్ల పాలనలో 1.19 లక్షల మంచినీటి కనెక్షన్లు
వైఎస్సార్ సీపీ హయాంలో 2,00,959 కనెక్షన్లు
మిగిలినవి : 1,78,070 — 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి వందశాతం పూర్తి

- వడివడిగా జలజీవన్ మిషన్ పనులు
- ఇప్పటి వరకు 1,057 పనులు పూర్తి
- మిగిలిన 1,194 పనులు ఈ ఆర్థిక సంవత్సరం చివరికి పూర్తి
- ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు
- వైఎస్సార్ సీపీ హయాంలో వేగవంతంగా పనులు

చీమకుర్తి: ప్రతి ఇంటికీ సురక్షిత జలాలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకంపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో 4,98,539 ఇళ్లకు మంచి నీటి కనెక్షన్లు ఇచ్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. 2019 ఏప్రిల్ 1వ తేదీ నాటికి టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కేవలం 1.19 లక్షల మంచినీటి కనెక్షన్లు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఇప్పటి వరకు 2,00,959 మంచినీటి కనెక్షన్లు ఇచ్చింది. ఇక మిగిలిన 1,78,070 కనెక్షన్లను ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోగా ఇచ్చేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో పనులు చేపడుతున్నారు. నూటికి నూరు శాతం పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రణాళిక ఇలా...
జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా 4.98 లక్షల మంచినీటి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.663 కోట్లు కేటాయించింది. ఆయా నిధులతో 2,469 పనులు చేపట్టింది. సురక్షితమైన తాగునీటిని ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి హర్ ఘర్ జల్ పేరుతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా అందించేందుకు జీవో నంబర్ 58ని తేదీ 16.02.2022 విడుదల చేసింది. తద్వారా 1,428 పనులను రూ.243.33 కోట్లతో చేసేందుకు నిధులు మంజూరు చేసింది. ఆయా పనుల్లో ఇప్పటి వరకు 1,057 పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పూర్తి చేశారు. జీవో నంబర్ 918 తేదీ.21.11.2022 ద్వారా 1,041 పనులకు రూ.420.74 కోట్లను మంజూరు చేసింది. వాటిలో 12 పనులకు అగ్రిమెంట్లు పూర్తయ్యాయి. మిగిలిన వాటికి అగ్రిమెంట్లు చేసుకుని పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పథకం ద్వారా గ్రామాల్లో నీటి సరఫరాకు పైప్‌లైన్ల నిర్మాణాలు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలు, మంచినీటిని ఫిల్టర్ చేసేందుకు సంపుల నిర్మాణాలు చేపట్టారు. వాటితో పాటు ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు.


జలజీవన్ మిషన్‌పై సింగరాయకొండలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ (ఫైల్)


జలజీవన్ మిషన్ ద్వారా యర్రగొండపాలెం మండలం గంగపాలెంలో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలు(ఫైల్)


ఏలూరివారిపాలెంలో మంచినీటి కుళాయిని ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, స్థానిక సర్పంచ్

సురక్షిత జలాలే లక్ష్యం



జిల్లాలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు హర్ ఘర్ జల్ పేరుతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.663 కోట్లతో 2,469 పనులు చేపట్టాం. మొత్తం 4.98 లక్షల మంచినీటి కనెక్షన్లకుగానూ ఇప్పటికే 3.20 లక్షలు ఇచ్చాం. ఇక మిగిలిన 1.78 లక్షల కనెక్షన్లను ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తిచేస్తాం.
– షేక్ మర్దన్ ఆలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఒంగోలు

శివారు ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

- సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నాం
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- నగరంలోని 50వ డివిజన్‌లో రూ.2.30 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


నేతాజీకాలనీలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని, మేయర్ గంగాడ, తదితరులు

ఒంగోలు సబర్బన్: నగరంలోని శివారు ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక 50వ డివిజన్‌లో రూ.2.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు గురువారం భూమి పూజలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ నగరంలోని శివారు ప్రాంతాల అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. వాళ్లు అభివృద్ధి చేస్తే.. ఇప్పుడు తాము కొత్తగా రోడ్లు వేయాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. 50వ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో రూ.27 లక్షలతో పార్కును అభివృద్ధి చేస్తున్నామని బాలినేని తెలిపారు. అందుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు.

జగనన్న భూ హక్కు రీ సర్వే పరిశీలన...
స్థానిక వెంకటేశ్వరకాలనీలో జగనన్న భూ హక్కు మరియు భూ రక్ష పథకంలో భాగంగా చేస్తున్న రీ సర్వేను ఎమ్మెల్యే బాలినేని పరిశీలించారు. డ్రోన్ ద్వారా చేస్తున్న సర్వేకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జగనన్న భూ హక్కు మరియు భూ రక్ష పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావును బాలినేని ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి పొరపాటు లేకుండా, కొత్త సమస్యలు సృష్టించకుండా రీ సర్వే చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. 50వ డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీలో రూ.1.23 కోట్లతో నిర్మించతలపెట్టిన తారు రోడ్డు శిలాఫలకాన్ని బాలినేని ఆవిష్కరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. 50వ డివిజన్లో ఇప్పటికే రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఇంకా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరంలోని మంగమ్మ డిగ్రీ కాలేజీ సమీపంలో ఉత్తర బైపాస్‌లో డివైడర్ నిర్మాణానికి కూడా బాలినేని భూమి పూజ చేశారు. రూ.80 లక్షలతో డివైడర్ నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, స్థానిక కార్పొరేటర్ అంబటి రాంబాబు, ఎంఈ కే మాల్యాద్రి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, చుండూరి రవిబాబు, డివిజన్ అధ్యక్షుడు సురేష్, కండె రాములు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచికంటి యాత్ర స్ఫూర్తిదాయకం


మంచికంటిని సన్మానిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: చిన్నారుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా మోటారు సైకిల్‌పై 2800 కిలోమీటర్లు యాత్ర చేసిన మంచికంటి వెంకటేశ్వరరెడ్డిని పలువురు సాహితీవేత్తలు అభినందించారు. స్థానిక జిల్లా గ్రంథాలయ ఆవరణలో గురువారం ఆయనకు అభినందన సభ నిర్వహించారు. గ్రంథాలయాల కోసం, పిల్లల చదువుల కోసం మోటారు సైకిల్ యాత్ర చేయడం బహు అరుదైన విషయమని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బొమ్మల కోటేశ్వరి అన్నారు. సదాశయంతో యాత్ర చేసిన మంచికంటి సాహసం ప్రతిఒక్కరికీ స్ఫూర్తినిస్తోందన్నారు. ఉరుకులు, పరుగుల జీవితంలో సమాజం కోసం సాహసం చేయడం ప్రశంసనీయమని శ్రీకృష్ణదేవ రాయ సాహిత్య సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు కొనియాడారు. 18 రోజులపాటు రాష్ట్రంలోని 26 జిల్లాలు తిరిగి గ్రంథాలయాలను సందర్శించి వాటి అవసరాన్ని చాటిచెప్పారన్నారు. సభకు నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించగా, మంచికంటిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి శ్రీరామకవచం సాగర్, బొమ్మిరెడ్డిల్లు రాజ్యలక్ష్మి, కత్తి కళ్యాణ్, బహుజన రచయిత వేదిక కార్యదర్శి మిరియం అంజిబాబు, కవులు రవికుమార్, పీకే ఖాన్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయానికి కొత్త భవనం

- రూ.3.35 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

ఒంగోలు సబర్బన్: నగర కార్పొరేషన్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. ఆ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. నూతన భవన నిర్మాణానికి రూ.3.35 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఆర్టీ నంబర్ 367 విడుదల చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోనే తొలుత రెండంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు అనుమతులిచ్చారు. ఆ తర్వాత మరో మూడు అంతస్తులు నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేయనున్నారు. గతంలో నూతన భవన నిర్మాణానికి కౌన్సిల్‌లో తీర్మానం చేసి అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి నూతన భవనం నిర్మించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినట్లు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

పేదింట్లో పెను విషాదం


మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

- రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం
- బైక్ నడుపుతున్న మేనల్లుడు కూడా మృతి
- వివాహానికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు పక్కన ఆగి ఉండగా ఢీకొట్టిన మినీ వ్యాన్
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురూ అక్కడికక్కడే మృతి
- రెండు గ్రామాల్లో విషాదం
- టంగుటూరు మండలం ఎం.నిడమానూరు సమీపంలో ఘటన

టంగుటూరు: రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుతో పాటు ఆ మహిళ మేనల్లుడు కూడా అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంఘటన టంగుటూరు మండలంలోని ఎం.నిడమానూరు-మర్లపాడు గ్రామాల మధ్య గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివాహానికి వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందడంతో ఆ పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. టంగుటూరు మండలంలోని ఎం.నిడమానూరు గ్రామంలో మేళం ఫణీంద్ర వివాహానికి అతని బంధువు అయిన కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన బందెల కోటిరత్నం (35), ఆమె కుమారుడు ప్రవీణ్‌కుమార్ (11) గురువారం ఉదయం ఏడు గంటలకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనం ముగించుకుని ఎండ తీవ్రంగా ఉండటంతో సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. సాయంత్రం తిరిగి ఈతముక్కల బయలుదేరుతుండగా, ఎం.నిడమానూరు గ్రామానికే చెందిన కోటిరత్నం మేనల్లుడు మేళం దిలీప్‌కుమార్ (22) బైక్‌పై సమీపంలోని కె.ఉప్పలపాడు వరకు వదిలిపెట్టి అక్కడ బస్ ఎక్కిస్తానని చెప్పాడు. ముగ్గురూ కలిసి బైక్‌పై బయలుదేరారు. మధ్యలో ఏమైందో ఏమోగానీ ఏకంగా బైక్‌పైనే ఈతముక్కల వరకు వదులుతానని చెప్పాడు. ఈ క్రమంలో మార్గం మధ్యలో ఎం.నిడమానూరు-మర్లపాడు మధ్య ద్విచక్రవాహనం ఆపి ఉండగా ఎదురుగా వచ్చిన మినీవ్యాన్ బలంగా ఢీకొట్టింది. మినీ వ్యాన్‌తో పాటు ద్విచక్రవాహనం, పక్కన ఉన్న ముగ్గురూ రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడిపోయారు. కొండపి మండలం ముప్పవరం గ్రామానికి చెందిన మినీ వ్యాన్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. వ్యాను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ఎస్సై ఖాదర్ బాషా మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. సంఘటనపై బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండె పగిలేలా రోదన...

కొండపి/కొత్తపట్నం: పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్న తల్లీ కొడుకు, వారిని డ్రాప్ చేసేందుకు బయలుదేరిన యువకుడు సైతం మృతిచెందడంతో టంగుటూరు మండలంలోని ఎం.నిడమానూరు, కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. రెండు గ్రామాల్లోని బంధువులు, కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. అప్పటి వరకూ వివాహ వేడుకలో బంధువులతో ఆనందంగా గడిపిన అమ్మాకొడుకులు విగతజీవులుగా మారడాన్ని ఏ ఒక్కరూ జీర్ణించుకోలేకపోయారు. అందరినీ నవ్విస్తూ తిరిగి తల్లీ కొడుకులను డ్రాప్ చేసేందుకు వెళ్లిన యువకుడు దిలీప్‌కుమార్ మృతిని తట్టుకోలేకపోయారు.


మేళం దిలీప్‌కుమార్ మృతదేహం

బస్ ఎక్కించి ఉంటే ప్రమాదం తప్పేది...
ప్రవీణ్‌కుమార్ మాటలు చెబుతుండగా కోటిరత్నం ఆలకిస్తోంది..దిలీప్‌కుమార్ బైక్ నడుపుతున్నాడు. ముందు కె.ఉప్పలపాడు వెళ్లి అక్కడ బస్ ఎక్కించాలని దిలీప్‌కుమార్ అనుకున్నాడు. కానీ, అక్కడ బడ్డీబంకులో పెట్రోలు పోయించుకున్నాడు. టీ నిడమానూరు-మర్లపాడు రోడ్డు వైపు బైకు తిప్పాడు. ఈతముక్కల గ్రామం వరకు తానే దించేస్తానని చెప్పాడు. నిడమానూరు గ్రామం దాటగానే ఎందుకో రోడ్డు పక్కన ఆగారు. అదే సమయంలో మినీట్రక్కు దూసుకొచ్చి పెనువిషాదం మిగిల్చింది. తొలుత అనుకున్నట్లు బస్ ఎక్కించి ఉంటే ప్రమాదం తప్పేదేమో.

తల్లడిల్లిన భర్త, కుమార్తె...
కోటిరత్నానికి భర్త సురేష్‌తో పాటు కుమార్తె లక్ష్మీ వరప్రసన్న ఉన్నారు. సురేష్ రాడ్‌బెండింగ్ పనులు చేస్తుంటాడు. పిల్లలిద్దరూ ఒంగోలులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. ప్రవీణ్‌కుమార్ నాలుగో తరగతి పూర్తిచేసి ఐదో తరగతిలో చేరాల్సి ఉంది. కుమార్తె 8వ తరగతిలో చేరాల్సి ఉంది. ఇంతలోనే ఈ దుర్ఘటనతో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నిరుపేద కూలీ కుటుంబంలో ఒక్కసారిగా విషాదం అలముకుంది. వారి స్వగ్రామం ఈతముక్కలలో రోదనలు మిన్నంటాయి. పిల్లలిద్దరినీ బాగా చదివించాలని కోటిరత్నం చెబుతుండేది. కానీ, కొడుకుతో కలిసే దుర్మరణం చెందడంతో భర్త, కుమార్తె తల్లడిల్లిపోయారు. విషాదం వార్త వినగానే వారు కుప్పకూలిపోయారు.


బందెల కోటిరత్నం మృతదేహం
ఇన్‌సెట్‌లో పాత చిత్రం

ఇంజినీరింగ్ చేరాలనుకున్న దిలీప్‌కుమార్...
ఈ ప్రమాదంలో మృతిచెందిన ఎం.నిడమానూరుకు చెందిన దిలీప్‌కుమార్ ఇంటర్ పూర్తి చేసి ఇంజినీరింగ్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నాడు. తల్లిదండ్రులు గురుమూర్తి, సుమావళి, తమ్ముడు నందు, చెల్లెలు లాస్యలు దిలీప్‌కుమార్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఇంతలోనే దిలీప్ మృతితో ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. దిలీప్ కుటుంబం సైతం బేల్దారి పనులు చేసుకుని రెక్కల కష్టంతో జీవనం సాగిస్తోంది. కొడుకు ఉన్నత చదువులు చదివి కష్టాల నుంచి గట్టెక్కిస్తాడని భావిస్తుండగా జరిగిన ప్రమాదం తీరని శోకం నింపింది.


బందెల ప్రవీణ్‌కుమార్ మృతదేహం

మృతదేహాలను పరిశీలించిన వరికూటి...
రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన సంఘటన తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు హుటాహుటిన ఎం.నిడమానూరు సమీపంలోని సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. బంధువులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి అందించాల్సిన సహాయాన్ని తక్షణమే అందించేందుకు అధికారులతో మాట్లాడారు.


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న వరికూటి

క్లుప్తంగా

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

తాళ్లూరు: పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. తాళ్లూరు ఎస్సీ కాలనీకి చెందిన శ్యాంసన్, వీరమ్మల రెండో కుమారుడు అనపర్తి మరియబాబు (20) పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో కుటుంబసభ్యులు ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

జిల్లా ల్యాండ్ సర్వే అధికారిగా కిషోర్‌బాబు



ఏడీని కలిసిన సర్వేయర్ల సంఘ నాయకులు

ఒంగోలు అర్బన్: జిల్లా ల్యాండ్ సర్వే అధికారిగా నియమితులైన డీవీఎస్ఎన్ కిషోర్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా సర్వేయర్ల సంఘ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు ఏడీగా పనిచేసిన గౌస్‌బాష బదిలీ కావడంతో అనంతపురంలో పనిచేస్తున్న కిషోర్ బాబును జిల్లా ల్యాండ్ సర్వే అధికారిగా నియమించారు. అభినందలనులు తెలిపిన వారిలో జిల్లా సర్వే ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ కోటి, కార్యదర్శి వై బాబురావు, కోశాధికారి విష్ణువర్ధన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాళం వెంకటేశ్వరరావు, ఇతర నాయకులు శివకుమార్, నందయ్య, నాగరాజుబాబు, శివప్రసాద్, పి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వెబ్‌సైట్‌లో కేజీబీవీ సిబ్బంది సీనియార్టీ జాబితా

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేస్తూ రిక్వెస్ట్ రీప్లేస్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్న సీపీటీ, పీఈటీ, నాన్ టీచింగ్ స్టాఫ్ అభ్యర్థుల ప్రొవిజినల్ సీనియార్టీ లిస్టు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.డీఈఓప్రకాశం.కో.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోగా ఒంగోలులోని సమగ్రశిక్ష కార్యాలయంలో తెలియజేయాలని స్పష్టం చేశారు. పార్ట్‌టైం పీజీటీలకు రిక్వెస్ట్ రీప్లేస్‌మెంట్ అవకాశం లేదని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులిచ్చినట్లు పేర్కొన్నారు.

సోషల్ పరీక్షకు 369 మంది గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ సోషల్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 369 మంది గైర్హాజరయ్యారని డీఈఓ పి.రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 1873 మందికిగాను 1504 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 14 కేంద్రాలను స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారని, పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో ముగిశాయని డీఈఓ తెలిపారు.

- ఆటో బోల్తా పడటంతో 17 మందికి స్వల్పంగా, ఐదుగురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులది హనుమంతునిపాడు మండలం వాలిచర్ల
- రేలంగి మేరీమాత ఆలయానికి వెళ్తుండగా రాపూరు–పెంచలకోన మధ్యలో ప్రమాదం



నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం



ప్రమాదంలో బోల్తా పడిన ట్రక్ ఆటో

ట్రక్ ఆటోను ఢీకొట్టిన కారు



బోల్తా పడిన ఆటో నుంచి బయటకు వస్తున్న వాలిచర్ల వాసులు





ఘటనా స్థలంలో క్షతగాత్రులు





రాపూరు/హనుమంతునిపాడు: ట్రక్ ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆటో బోల్తా పడి 22 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన నెల్లూరు జిల్లా రాపూరు మండలం గోనుపల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. రాపూరు పోలీసులు, బాధితుల కథనం మేరకు.. హనుమంతునిపాడు మండలం వాలిచర్ల గ్రామానికి చెందిన కూడలి జయమ్మ నెల్లూరు జిల్లా కొత్త కోడురులోని రేలంగి మేరీ మాత ఆలయంలో మొక్కు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మేరీ మాత ఆలయంలో ఉత్సవానికి జయమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు మొత్తం 28 మంది ట్రక్ ఆటోలో గురువారం ఉదయం 5 గంటలకు బయలుదేరారు. రాపూరు మీదుగా కొత్త కోడూరు వెళ్తుండగా గోనుపల్లి–పెనుబర్తి గ్రామాల మధ్య ట్రక్ ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తునన్న వారంతా చెల్లాచెదురుగా పడిపోయి ఆర్తనాదాలు చేశారు. ఐదుగురికి తీవ్రంగా, 17 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ కూడలి జయరావుతోపాటు మరో ఐదుగురు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. కాగా ఇరు గ్రామాల ప్రజలు, పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పలువురు క్షతగాత్రులను హైవే మొబైల్ వాహనంలో రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ధనలక్ష్మి, నరసయ్య, సాదు మార్తమ్మ, శిరీషా, శ్రావణికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారులో ఉన్న వ్యక్తులు వాహనాన్ని అక్కడే వదిలేసి మరో వాహనంలో వెళ్లిపోయారు. ప్రమాద ధాటికి కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రాపూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

నవరత్నాలతో సంక్షేమ విప్లవం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: పల్లెల్లో, పట్టణాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న 12వ బ్లాక్‌లో కౌన్సిలర్ ఫాతిమా షేక్షావలి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అమ్మ ఒడి, ఆసరా, రైతు భరోసా, జగనన్న ఇళ్లు, విద్యా దీవెన తదితర పథకాల ద్వారా లబ్ధిపొందిన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీకి హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 10 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ముఖ్యమంత్రి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటేసి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు దొడ్డా భాగ్యలక్ష్మి, హర్షిత, వార్డు ఇన్చార్జీలు రోజ్‌లిడియా, కరీముల్లా, ఉస్మాన్, గుండారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ షేక్షావలి, మున్సిపల్ మాజీ చైర్మన్ మీరావలి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

- నగదు, బంగారం, వెండి వస్తువుల అపహరణ

చీమకుర్తి: చీమకుర్తి మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వర శ్రీనివాస జనరల్ స్టోర్‌లో బుధవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం ...షాపు యజమాని శిద్దా కృష్ణ చైతన్య బుధవారం రాత్రి షాపును మూసేసి గురువారం ఉదయం షాపు తలుపులు తెరిచి లోపలకు వెళ్లగానే షాపు వెనుక తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి దొంగలు పడ్డారని అనుమానంతో షాపులోని బీరువాలలో వస్తువులను పరిశీలించాడు. బీరువాలోని రూ.90 వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు, ఒక పాపిటి బిళ్ల, 150 గ్రాముల వెండి నాణేలు, రూ.1.10 లక్షల విలువైన వెండి వస్తువులు, బంగారు నాణెం చోరీకి గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై జి.రామిరెడ్డి క్లూస్ టీంతో వచ్చి వేలిముద్రలను సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్



షాపు వెనుక తలుపులను పరిశీలిస్తున్న ఎస్సై రామిరెడ్డి

వడగాడ్పులకు వృద్ధుడు మృతి



మృతి చెందిన సుందరరావు

నాగులుప్పలపాడు: తీవ్రమైన వడగాడ్పులకు తాళలేక ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం ఉదయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై హరిబాబు కథనం మేరకు.. జరుగుమల్లి మండలం సాధువారిపాలెం గ్రామానికి చెందిన పాటిబండ్ల సుందరరావు(65) బుధవారం ఉప్పుగుండూరు గ్రామంలో వివాహానికి హాజరయ్యాడు. అధిక మోతాదులో మద్యం తాగి తిరుగు ప్రయాణంలో ఉప్పుగుండూరు బైపాస్‌కు చేరుకున్నాడు. అక్కడ చెట్టు కింద ఉన్న సమయంలో మత్తు ఎక్కువై పక్కనే ఉన్న కాలువలో జారిపడ్డాడు. ఎవరూ గమనించకపోవడంతో వడగాడ్పులకు గొంతు ఎండి పోయి మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

ఫ్యాన్సీ దుకాణం దగ్ధం

- రూ.10 లక్షల వరకు నష్టం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో నిత్యం రద్దీగా ఉండే బాపూజీ కాంప్లెక్స్‌లో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. వివరాలు.. కాంప్లెక్స్‌లోని షాపు నంబర్ 387లో ప్రణీత్ ఎంటర్‌ప్రైజెస్ అనే ఫ్యాన్సీ గూడ్స్ హోల్‌సేల్ దుకాణం అండర్‌గ్రౌండ్‌లో సాయంత్రం 5 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. వెంటనే అప్రమత్తమైన దుకాణ యజమాని సీహెచ్ సురేష్ విద్యుత్ మెయిన్ ఫ్యూజ్ తొలగించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేయడంతో మిగిలిన దుకాణదారులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగలు వ్యాపించాయి. సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని దుకాణ యజమాని చెప్పారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన

- విజేతగా నిలిచిన కురిచేడు మండలం కాటంవారిపల్లె ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్లు

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి గ్రామ సమీపంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామిఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన న్యూ కేటగిరీ విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగాయి. కురిచేడు మండలం కాటంవారిపల్లె గ్రామానికి చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లు నిర్ణీత సమయంలో బండను 3,807 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. గిద్దలూరు మండలం బురుజుపల్లె గ్రామానికి చెందిన ఎర్రమల్ల సోహిత్‌రెడ్డి ఎడ్లు 3,250 అడుగులు లాగి రెండో స్థానం, నల్గొండ జిల్లా గుర్రంపాడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన ఐతరాజు సత్యనారాయణ, నర్సరావుపేట మండలం పమిడిమర్రు గ్రామానికి చెందిన ఎర్రసాని సుబ్బయ్య సంయుక్త ఎడ్ల జత 2,873 అడుగులు లాగి మూడో స్థానం, నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన గొటికె రవితేజేశ్వరరెడ్డి ఎడ్లు 2,796 అడుగులు లాగి నాలుగో స్థానం, మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన తిండి నక్షత్రారెడ్డి ఎడ్లు 2,791 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.50 వేలను ఏర్వ పెద్దఅచ్చిరెడ్డి, రెండో బహుమతి రూ.40 వేలను కాసు అయప్పరెడ్డి, కుందురు వీరారెడ్డి, మూడో బహుమతి రూ.30 వేలను విద్యుత్ శాఖ ఏఈ ఏరువ నాగేంద్రరెడ్డి, నాలుగో బహుమతి రూ.20 వేలను ఏలూరి శ్రీనివాసరెడ్డి, ఐదో బహుమతి రూ.10 వేలను హనుమాన్ జంక్షన్ కుంటకు చెందిన భారతి సిమెంట్ డీలర్ అందజేశారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, పశుపోషకులు హాజరయ్యారు.

జీజీహెచ్‌లో ఎలక్ట్రో థెరపీ యంత్రం



సీపీటీ యంత్రం అందజేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీజిహెచ్)లో ఎలక్ట్రో థెరపీ (సీపీటీ) యంత్రం అందుబాటులోకి వచ్చింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ నిధులతో సీపీటీ యంత్రాన్ని కొనుగోలు చేశారు. గురువారం సదరు యంత్రాన్ని సైకియాట్రీ విభాగం డాక్టర్లు, అధికారులకు జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఏ ఆసుపత్రిలో ఈ పరికరం లేదని, ఇప్పుడు జీజీహెచ్‌లో అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ పరికరం ద్వారా మతి స్థిమితం లేని రోగులకు, ఆత్మహత్యాయత్నం చేసిన వారికి, అత్యవసర పరిస్థితిల్లో ఉన్న గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందిచేందుకు వీలవుతుందన్నారు. ఇప్పటివరకు ఈ యంత్రం అవసరమైన వారిని రిఫరల్ ఆసుపత్రికి పంపాల్సి వచ్చేదన్నారు. ఈ పరికరంతో వైద్యం అందించేందుకు ఇతర ఆసుపత్రుల్లో సుమారు రూ.60వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఇప్పుడు జీజీహెచ్‌లో ఈ యంత్రం అందుబాటులోకి వచ్చిందన్నారు. కొనుగోలుకు అనుమతి ఇచ్చిన కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి రిచర్డ్స్, ఆర్ఎంఓ చైతన్యవర్మ, ఇతర డాక్టర్లు ప్రసాద్, మల్లికార్జున్, సాగర్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురంలో రెండు చోరీలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో బుధవారం అర్ధరాత్రి ఓ ఇంటితోపాటు మరో దుకాణంలో దొంగలు చొరబడి నగలు, నగదు అపహరించారు. పట్టణ ఎస్సై శశికుమార్ కథనం మేరకు.. పట్టణంలోని నాయుడు బజార్‌లో అజయ్‌కుమార్‌కు చెందిన పెయింట్ షాపు షట్టర్ తాళాలు పగలగొట్టిన దొంగలు రూ.1.10 లక్షల నగదు దోచుకున్నారు. అలాగే జవహర్ నగర్ కాలనీలో నివాసం ఉండే ఎం.రాజశేఖర్‌రెడ్డి ఈ నెల 5వ తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా వెనుక వైపు తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా తాళం పగలగొట్టి 20 తులాల బంగారు ఆభరణాలు కాజేశారు. ఇద్దరు బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.